సాక్షి అనంతపురం

మంగళవారం । 1 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 529 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.150

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.150 పలికింది. కనిష్టం రూ.120, సరాసరి రూ.132 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

34.1°/22.4°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

అసైనీలకు హక్కు!

నిషేధిత భూముల జాబితా నుంచి విముక్తి కల్పించి రైతులకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెండు దశాబ్దాల తర్వాత భూములు తమ సొంతం అవబోతుండటంతో రైతుల కళ్లలో సంతోషం కనిపిస్తోంది. యాజమాన్య హక్కులు వస్తే క్రయవిక్రయాలకు కూడా అవకాశం కలగనుంది.

- నిషేధిత జాబితా నుంచి త్వరలో అసైన్డ్ భూముల తొలగింపు
- 20 ఏళ్ల క్రితం 78 వేల మందికి 2.22 లక్షల ఎకరాల భూమి అసైన్డ్
- భూ పంపిణీకి జాబితా సిద్ధం చేస్తున్న జిల్లా అధికార యంత్రాంగం
- 1,512.50 ఎకరాల ప్రభుత్వ భూములను 1,140 మంది సాగు చేస్తున్నట్లు గుర్తింపు



అనంతపురం అర్బన్: రైతు సంక్షేమం కోసం జగన్ సర్కారు మరో అడుగు ముందుకు వేసేందుకు సన్నద్ధమయ్యింది. 20 ఏళ్ల క్రితం నాటి అసైన్డ్ భూములకు, ఏళ్లుగా సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించనుంది. ఆ భూములను అనుభవిస్తున్న రైతులకు యాజమాన్య హక్కు పత్రాలు అందించేందుకు అవసరమైన ప్రక్రియ చేపట్టింది. ఈ మేరకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం అసైన్డ్ భూముల వివరాలను సిద్ధం చేస్తోంది. అసైన్డ్ భూమి అసలైన అసైనీలు ఎందరు.. వారి వద్ద ఉన్న భూమి ఎంత.. అసైనీల వారసులు ఎందరు.. వారి వద్ద ఉన్న భూమి ఎంత.. క్రయ,విక్రయాల ద్వారా ఎన్ని ఎకరాలు అసైన్డ్ భూమి ఎంత మంది మూడవ వక్తుల వద్ద ఉందనే వివరాలను బయటకు తీస్తున్నారు. అదే క్రమంలో భూ పంపిణీ కింద హక్కు కల్పించేందుకు ప్రభుత్వ భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వర్గాల రైతులు, మాజీ సైనికుల వివరాలనూ రెడీ చేస్తున్నారు.

రైతులకు యాజమాన్య హక్కు ..

అసైన్‌మెంట్ భూములు, చుక్కల (08) భూములను 22–ఏ (నిషేధిత భూములు) జాబితాలో చేర్చారు. వీటిలో 1954 జూన్ 18 కంటే ముందు అసైన్డ్ చేసిన భూములను మాత్రమే ఇప్పటి వరకు 22–ఏ జాబితా నుంచి తొలగిస్తూ వచ్చారు. అసైన్‌మెంట్ భూములకు విముక్తి కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. 20 ఏళ్ల క్రితం 78,040 మంది రైతులకు అసైన్డ్ చేసిన 2,22,902.05 ఎకరాల భూములకు సంబంధించి అసలైన అసైనీలకు లేదా వారి వారసులకు యాజమాన్య హక్కు కల్పించాలని నిర్ణయించింది. తద్వారా జిల్లాలో 72,271 మంది అసైనీలు, వారి వారసులకు లబ్ధి చేకూరనుంది. ఇక అసైన్డ్ భూముల క్రయ, విక్రయాల ద్వారా పొందిన వారు 5,769 మంది ఉన్నారు. ఈ భూముల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

భూ పంపిణీ కింద 1,511 ఎకరాలు..

అసైన్డ్ చేయని ప్రభుత్వ భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వారికి భూ పంపిణీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చనున్నారు. జిల్లాలో వివిధ వర్గాలకు చెందిన 1,140 మంది రైతులు 1,511 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నట్లు గుర్తించారు. వీరందరికీ భూ పంపిణీ పథకం కింద భూ హక్కు కల్పించనున్నారు.

భూ పంపిణీ కోసం ప్రతిపాదనలు

రెవెన్యూ డివిజన్	రైతులు	భూమి ఎకరాల్లో
అనంతపురం	363	520
కళ్యాణదుర్గం	191	279.5
గుంతకల్లు	586	713
మొత్తం	1,140	1,512.5

భూ పంపిణీలో లబ్ధిపొందనున్న వర్గాలు

సామాజికవర్గం	రైతులు	ఎకరాలు
ఎస్సీ	328	368
ఎస్టీ	40	60
బీసీ	675	925
మైనారిటీ	9	8.50
ఇతరులు	86	142
మాజీ సైనికులు	2	9
మొత్తం	1,140	1,512.5

అసైన్డ్ చేసిన భూముల వివరాలు

రెవెన్యూ డివిజన్	20 ఏళ్ల క్రితం మొత్తం అసైనీలు	అప్పట్లో అసైన్డ్ చేసిన భూమి (ఎకరాల్లో)	ప్రస్తుతం మిగిలిన అసలు అసైనీలు	వారి వద్ద ఉన్న భూమి (ఎకరాల్లో)	అసైనీ వారసులు	వారి వద్ద ఉన్న భూమి (ఎకరాల్లో)	భూమిలో ఉన్న థర్డ్ పార్టీ వ్యక్తులు	వారివద్ద ఉన్న భూమి (ఎకరాల్లో)
అనంతపురం	24,205	55,298.66	11,814	27,457.88	9,711	21,773.26	2,680	6,067.52
గుంతకల్లు	18,766	42,550.65	5,508	11,730.55	10,936	25,827.90	2,322	4,992.20
కళ్యాణదుర్గం	35,069	1,25,052.74	10,793	36,639.57	23,509	85,824.26	767	2,588.91
మొత్తం	78,040	2,22,902.05	28,115	75,828.00	44,156	1,33,425.42	5,769	13,648.63

జాబితా సిద్ధమవుతోంది



జిల్లాలో 20 ఏళ్ల క్రితం అసైన్డ్ చేసిన భూముల వివరాలకు సంబంధించిన జాబితా తయారీపై రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అసైన్డ్ చేయని వ్యవసాయ యోగ్యమైన ప్రభుత్వ భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వారి వివరాలతో జాబితానూ తయారు చేస్తున్నారు. ప్రభుత్వం అడిగిన వెంటనే జాబితాలు పంపిస్తాం. – ఎం.గౌతమి, కలెక్టర్

అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదు



శెట్టూరు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

కళ్యాణదుర్గం: 'పండుగలు సంప్రదాయాలకు ప్రతీకలు.. ఇలాంటి పండుగలను సామరస్యంగా జరుపుకోవాలి.. అలా కాదని అల్లర్లు సృష్టిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేద'ని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మొహర్రం సందర్భంగా కంబదూరు, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో జరిగిన అల్లర్లకు కారకులైన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఇలాంటి సమయంలో గ్రామ కమిటీలు సంయమనం పాటించాలన్నారు. మొహర్రంలో జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి అలజడులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్కడా డీజే సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదన్నారు. పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.శ్రీనివాసులు, రూరల్ సీఐ శ్రీనివాసులు, పట్టణ సీఐ తేజమూర్తి పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీ వద్దు..

శెట్టూరు: సమాజంలో శాంతిభద్రతలు కాపాడే విషయంలో పోలీసులు రాజీ పడకూడదని ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం శెట్టూరు, కుందుర్పి పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ప్రజలకు పోలీసులంటే నమ్మకం, గౌరవం కలిగేలా విధులు నిర్వర్తించాలన్నారు. ఫ్యాక్షన్ , సమస్యాత్మక గ్రామాల్లోని తాజా పరిస్థితులపై సమీక్షించారు. సచివాలయ మహిళా పోలీసులతో సమన్వయం చేసుకొని మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలు, నేరాల కట్టడికి అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు యువరాజ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కణేకల్లు చెరువుకు తుంగభద్ర జలాలు



ఆంధ్రా సరిహద్దులో హెచ్చెల్సీలో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి విడుదలైన జలాలు సోమవారం ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 989 క్యూసెక్కుల మేర వస్తున్నట్లు డీఈఈ మద్దిలేటి తెలిపారు. కణేకల్లు చిక్కణ్ణేశ్వర చెరువుకు జలాలు చేరాయి. ఇక్కడి నుంచి పీఏబీఆర్‌కు నీరు వదులుతామన్నారు. రెండు రోజుల తర్వాత సరిహద్దులో నీటి విడుదల పరిమాణాన్ని పెంచుతామని పేర్కొన్నారు. ప్రమాదకరంగా ఉన్న కాలువ గట్ల వద్ద గస్తీ ముమ్మరం చేసినట్లు చెప్పారు.

టీబీ డ్యాంలో 76 టీఎంసీలు..

ఎగువన కురుస్తున్న వర్షాలతో టీబీ డ్యాంకు భారీగా వరద నీరు చేరుతోంది. సోమవారం ఉదయానికి జలాశయంలో 76.191 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 46,669, అవుట్‌ఫ్లో 2,099 క్యూసెక్కులుగా నమోదైంది.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తాడిపత్రి అర్బన్: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తాడిపత్రి పట్టణంలోని పలు పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్లలో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఈశ్వర్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు మూడు బృందాలుగా విడిపోయి పెట్రోల్ బంకుల్లో పెట్రోలు, డీజిల్ నాణ్యత, కొలతలను పరిశీలించారు. అలాగే అనుమతి పత్రాలు, లైసెన్సులు తనిఖీ చేశారు. నిబంధనల మేరకే ఇంధన విక్రయాలు జరుగుతున్నట్లు తనిఖీల్లో తేల్చారు. తనిఖీల్లో అధికారులు సాయిప్రసాద్, విజిలెన్స్ ఎస్ఐ జయపాల్ రెడ్డి, రామారావు, రాజశేఖర్, మెట్రాలజీ శాఖ అధికారి మహ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్లకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయుల (తాత్కాలిక) పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల జిల్లా కన్వీనర్ మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఆగస్టు మూడో తేదీన కురుగుంట గురుకుల కళాశాలలో నిర్వహించే డెమోకు హాజరు కావాలన్నారు. డెమోలో ఎంపికైన అభ్యర్థులను రోస్టర్ ప్రకారం గురుకుల పాఠశాలల్లో ఏడాది పాటు బోధించడానికి నియమిస్తామని తెలిపారు.

ఐటీ శాఖకే కన్నం

- నకిలీ డాక్యుమెంట్లతో క్లెయిమ్‌లు
- ఐటీ రిటర్న్స్ కోసం తప్పుడు దారి
- అధికారుల పరిశీలనలో బట్టబయలు
- ఉమ్మడి జిల్లాలో 2వేల మందికి నోటీసుల జారీ
- మరో వెయ్యి మందికి కూడా నోటీసులు ఇచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి అనంతపురం: కొందరు ఉద్యోగులు ఆదాయపు పన్ను (ఐటీ) శాఖకు కన్నం వేశారు. నకిలీ డాక్యుమెంట్లు పెట్టి తమకు రావాల్సిన సొమ్ము కంటే ఎక్కువ డబ్బును క్లెయిమ్ చేసుకున్నారు. ఉదాహరణకు వార్షిక ఆదాయం రూ.10 లక్షలుంటే ఆదాయపన్ను 15 శాతం కట్టాల్సి ఉంటుంది. కోత పడిన రూ.1.50లక్షల్లోంచి హెల్త్ ఇన్సూరెన్స్, ఎల్ఐసీలు, ట్యూషన్ ఫీజులు, హౌసింగ్ లోన్లు ఇలా రకరకాల సేవింగ్‌లు ఉన్నట్టు చూపించి రూ.1.20 లక్షలు క్లెయిముల ద్వారా వెనక్కు వచ్చేలా చేసుకున్నారు. ఐటీ శాఖ అధికారులకు అనుమానం వచ్చి క్లెయిములు పరిశీలిస్తే చాలా వరకు నకిలీవని తేలింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దాదాపు 2వేల మందికి నోటీసులు జారీ చేశారు. ఇందులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నట్టు ఆదాయ పన్ను శాఖ వివరాల్లో వెల్లడైంది.

ఆదాయపు పన్ను శాఖ నిబంధనల ప్రకారం శ్లాబు రేట్లు ఇలా

ఆదాయం కేటగిరీ	ఐటీకి చెల్లించాల్సిన శాతం
రూ.5 లక్షలు - రూ.7.50 లక్షలు	10
రూ.7.50 లక్షలు - రూ.10 లక్షలు	15
రూ.10లక్షలు - రూ.12.50 లక్షలు	20
రూ.12.50 లక్షలు - రూ.15 లక్షలు	25
రూ.15 లక్షలు - ఆ పైన	30

హైదరాబాద్ ట్యాక్స్ కన్సల్టెంట్ల ప్రమేయం

కరోనా అనంతరం చాలామంది బహుళజాతి కంపెనీల ఉద్యోగులు వర్క్ ఫ్రం హోం (ఇంటి నుంచే పని) చేస్తున్నారు. ఐటీ శాఖకు కట్టాల్సిన దాన్ని తగ్గించుకోవాలన్న తాపత్రయంతో చాలా మంది హైదరాబాద్‌లో ట్యాక్స్ కన్సల్టెంట్లను సంప్రదించినట్టు తెలిసింది. వారి ద్వారా రకరకాల డాక్యుమెంట్లు పెట్టి ఐటీ శాఖకు పంపించారు. ఇందులో ప్రధానంగా వార్షికాదాయం రూ.10 లక్షలకు మించి ఉన్న వారు ఇష్టారాజ్యంగా ట్యాక్స్‌కు సంబంధించిన నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చారు. కొంతమంది ట్రస్టులకు విరాళాలు ఇచ్చినట్టు సృష్టించి ఐటీ రిటర్న్స్ వచ్చేలా చేసినట్టు తేలింది. దీంతో అలాంటి వాళ్లందరికీ ఐటీ శాఖ నోటీసులు జారీచేసింది.



అనంతపురంలోని ఐటీ కార్యాలయం

ఆరో తేదీ వరకు గడువు

తమకు రావాల్సిన దానికంటే పెద్దమొత్తంలో రిటర్న్స్ తెచ్చుకుని నోటీసులు అందుకున్న వారు ఆగస్టు ఆరో తేదీలోగా ఒరిజినల్ డాక్యుమెంట్లు సమర్పించాలని ఐటీ శాఖ పేర్కొంది. ఆ తేదీలోగా ధ్రువపత్రాలు ఇవ్వకపోతే భారీగా జరిమానా విధిస్తారు. అంతకూ చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి వెనుకాడరు. దీంతో ఆయా వేతనదారులు గగ్గోలు పెడుతున్నారు. మరో వెయ్యి మందికి పైగా నోటీసులు వచ్చే అవకాశం ఉన్నట్టు ఐటీ శాఖ అధికారులు చెబుతున్నారు.

200 శాతం జరిమానా



ట్యాక్స్ రిటర్న్స్ కోసం తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇస్తే 200 శాతం మేర జరిమానా వేస్తారు. అంటే మనకు లక్ష రూపాయలు రిటర్న్ వస్తే ఆ రూ.లక్షను బ్లాక్ చేసి మరో రూ.2 లక్షలు ఫైన్ వేస్తారు. ఇది ఐటీ శాఖ రూల్స్. అందుకే ట్యాక్స్ కన్సల్టెంట్‌లకు అర్హత ఉండాలి. నిపుణులతో చేయించుకుంటేనే ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

– రాజేష్ గౌడ్, చార్టెడ్ అకౌంటెంట్

విరివిగా చిరుధాన్యాల సాగు

- రైతులకు మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు



రైతులకు చిరుధాన్యాల విత్తనాలను అందజేసిన మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: చిరుధాన్యాల పంటలను రైతులు విరివిగా సాగు చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో పీఎంఏజేవై కింద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు వంద శాతం రాయితీపై చిరుధాన్యాల విత్తనాలను సోమవారం కళ్యాణదుర్గం ఆర్బీకేలో పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ విధానంలో మార్పు రావాలన్నారు. రసాయన ఎరువులు మన శరీరంలోకి వెళ్లకుండా సేంద్రియ ఎరువులతో పంటలను పండించాలని సూచించారు. పూర్వీకులు చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. దీని ద్వారా బీపీ, షుగర్, గుండెపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులు దరి చేరేవి కావన్నారు. ఉచితంగా అందిస్తున్న చిరుధాన్యాల విత్తనాలను ఎస్సీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీలకు చిరుధాన్యాల విత్తనాలను 50 శాతం రాయితీతో అందిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 91 మంది రైతులకు రూ.9.10 లక్షల విలువ చేసే చిరుధాన్యాల విత్తనాలను అందజేశామన్నారు.

బీటీపీ కాలువ నిర్మాణానికి ముందడుగు..

భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ) కాలువ తవ్వకం పనులకు ముందడుగు పడిందని మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. రైతు దినోత్సవం నాడు బీటీపీ పనుల పూర్తికి నిధులు కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని, ఆ మేరకు తొలి విడతగా రూ.135 కోట్లు విడుదల చేశారని తెలిపారు. కాలువకు భూములు కోల్పోయిన రైతుల ఖాతాలకు పరిహారం జమ చేసినట్లు చెప్పారు. ఒక్క బోరంపల్లిలోనే రూ.7 కోట్ల మేర రైతులకు పరిహారం రూపంలో వచ్చిందన్నారు. అయితే నాటి టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఓట్ల కోసం ఆర్భాటంగా పనులు ప్రారంభించి, చేతులు దులుపుకుందని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం రైతులకు పరిహారం ఇచ్చాకే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, వ్యవసాయ శాఖ ఏడీఏ యల్లప్ప, ఏఓ జగదీష్, ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీ కాంతమ్మ, ఎంపీడీఓ సాలమాన్, అగ్రి బోర్డు కమిటీ సభ్యుడు నిజవల్లి బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్సీ రైతులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతం

- ప్రజలకు 2,47,641 ఉచిత ప్రభుత్వ సేవలు

జగనన్న సురక్ష ద్వారా అందించిన సేవలు

శాఖ	సేవల సంఖ్య
రెవెన్యూ	2,28,123
ఆధార్	15,566
పౌర సరఫరాలు	2,343
గ్రామ, వార్డు సచివాలయ	1,026
వైద్య, ఆరోగ్య	260
మున్సిపల్ పరిపాలన	117
రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్	104
గ్రామీణాభివృద్ధి	66
వ్యవసాయ	32
కార్మిక	4




మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి

అనంతపురం అర్బన్/ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జులైలో నెల రోజులపాటు చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను కలెక్టర్ గౌతమి సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డితో కలిసి మీడియాకు వెల్లడించారు. జూన్ 24 నుంచి 30 వరకు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, జులై 1 నుంచి 31 వరకు మొత్తం 663 గ్రామ, వార్డు సచివాలయాల వారీగా క్యాంపులు నిర్వహించామని తెలిపారు. రూరల్ పరిధిలో మొత్తం 1,56,232, అర్బన్ పరిధిలో 95,382 అర్జీలు అందాయన్నారు. 11 అంశాలకు సంబంధించి మొత్తం 2,47,641 సేవలు ఉచితంగా అందజేసినట్లు వివరించారు. ఇందులో రూరల్ పరిధిలో 1,53,346, అర్బన్ పరిధిలో 94,315 ఉన్నాయన్నారు. మొత్తం సేవల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 2,28,123 మందికి అవసరమైన ధ్రువపత్రాలు జారీ చేశారన్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందక మిగిలిపోయిన వారిని గుర్తించి వివరాలను ప్రభుత్వానికి పంపించామన్నారు. వీరందరికీ లబ్ధి చేకూర్చే కార్యక్రమాన్ని ఈ నెల 2వ లేదా 3వ వారంలో ప్రభుత్వం నిర్వహించే అవకాశం ఉందన్నారు. అదే విధంగా అభివృద్ధి పనులకు సంబంధించి కొన్ని వినతులు వచ్చాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

అనంతపురం అర్బన్: వివిధ సమస్యలపై 'స్పందన', 'జగనన్నకు చెబుదాం'లో వచ్చే అర్జీలకు సత్వరం నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి 360 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

ప్రాంతీయ సమన్వయకర్తగా పెద్దిరెడ్డి



అనంతపురం క్రైం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్తగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇన్‌చార్జ్ జిల్లా రిజిస్ట్రార్‌గా కృష్ణకుమారి

అనంతపురం టౌన్: స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్(డీఆర్)గా కృష్ణకుమారి నియమితులయ్యారు. ఇక్కడ డీఆర్‌గా పని చేస్తున్న నాగభూషణం మూడు రోజుల క్రితం మృతి చెందారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారికి అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగిస్తూ ఆ శాఖ ఐజీ రామకృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

అనంతపురం అర్బన్: జిల్లాలో ఆగస్టు నెలకు సంబంధించిన రేషన్ మంగళవారం నుంచి పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గాయత్రీదేవి సోమవారం తెలిపారు. కార్డుదారులకు పౌష్టికమైన ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు ఇతర సరుకులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్డుదారుల కోరిన మేరకు కిలో నుంచి మూడు కిలోల వరకు బియ్యం స్థానంలో రాగులు, జొన్నలను ఉచితంగా పంపిణీ చేస్తారని చెప్పారు.

గవిమఠం భూముల స్వాహా

- కర్ణాటకలోని అసొండిలో రూ.10 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- గుట్టుచప్పుడు కాకుండా 47.48 ఎకరాల విక్రయం
- పీఠాధిపతి ప్రధాన శిష్యుడి సహకారంతోనే అక్రమాలు

ఉరవకొండ: కంచే చేను మేసింది. మఠం ఆస్తులను కాపాడాల్సిన వారే స్వాహా చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ అక్రమాలకు వెనుక మఠం పీఠాధిపతి ప్రధాన శిష్యుడి హస్తమున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అత్యంత ప్రఖ్యాతి గాంచిన ఉరవకొండలోని గవిమఠానికి ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 770 శాఖ మఠాలు ఉన్నాయి. ఈ మఠాల పరిధిలో రూ.కోట్ల విలువ చేసే 3 వేల ఎకరాల భూములు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే 1,500 ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది. వీటిని రూ. కోట్లకు గవి మఠంలో పనిచేస్తున్న కీలక వ్యక్తి విక్రయించినట్లు తెలుస్తోంది.

అర్చకులే భక్షకులై..

కర్ణాటకలోని బళ్లారి జిల్లా అసొండి గ్రామంలో కరిబసవస్వామి గవిమఠానికి సంబంధించి 47.48 ఎకరాల భూమి ఉంది. ఈ భూములను సాగు చేయడం ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయంలో నిత్య పూజలు, భజనలు జరిగేలా చూడాలని 1987లో అప్పటి అర్చకులు మఠం ఎర్రిస్వామి, మఠం రుద్రయ్యస్వామి, మఠం బసవరాజుకు 7వ పీఠాధిపతి అప్పగించారు. ఈ భూములను కొన్నేళ్లుగా అనుభవించి మఠం ఎర్రిస్వామితో పాటు ఆయన కుమారులు మఠం విరుపాక్షి, మఠం శంకరయ్య, మరో అర్చకుడు మఠం రుద్రయ్యస్వామి ప్రస్తుత పీఠాధిపతి వద్ద పనిచేస్తున్న ఓ కీలక వ్యక్తి సహకారంతో ఇతరులకు విక్రయించారు. ప్రస్తుతం మఠం ఎర్రిస్వామి, అతని కుమారుడు మఠం విరుపాక్షి ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో పూజారులుగా కొనసాగుతూ ప్రతి నెలా రూ.15వేల జీతం పొందుతున్నారు. అంతేకాక మఠంలో ఎలాంటి హుండీ ఏర్పాటు చేయకుండా భక్తుల కానుకలను సైతం వారే తీసుకుంటున్నారు. ఈ లెక్కన ప్రతి నెలా రూ.20 వేల వరకు భక్తుల కానుకలు స్వాహా అవుతున్నట్లు తెలుస్తోంది.


అసొండిలో కరిబసవస్వామి మఠం ఆలయం కూల్చి నిర్మించుకున్న ఇల్లు

అసొండిలో అన్యాక్రాంతమైన మఠం భూముల వివరాలు:

సర్వే నెం.	భూ విస్తీర్ణం
124	15.10 ఎకరాలు
120బీ	03.99 ఎకరాలు
126	16.25 ఎకరాలు
290	12.14 ఎకరాలు
మొత్తం	47.48 ఎకరాలు

నోరుమెదపని అధికారులు

కొన్నేళ్లుగా మఠం పీఠాధిపతులను ఆ మఠం ఏజెంట్ రాజన్నగౌడ్ తన గుప్పిట్లో పెట్టుకుని అంతా తానై నడిపిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. కర్ణాటకలోని మాన్వి తాలూకా కల్లూరులో సర్వే నంబర్ 110, 94, 95లో 60ఎకరాల గవి మఠం భూమిని రూ.50 లక్షలకు ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. అప్పట్లో దీనిపై విచారణ చేసిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు వాస్తవాలు నిగ్గు తేల్చి ఏజెంట్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయించారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో నడుస్తోంది. అలాగే గతంలో మఠం ఇన్‌చార్జ్ ఈఓగా పనిచేసిన మల్లికార్జున సైతం కర్ణాటకలోని చేళ్లగురికిలో సర్వే నంబర్ 114లో ఉన్న మఠం భూమిని తన పేరుతో పాటు కుటుంబసభ్యుల పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి, ఆ భూములు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మఠం అర్చకుడు మఠం ఎర్రిస్వామితో పాటు కుమారులు మఠం విరుపాక్షి, మఠం శంకరయ్య అసొండిలో మఠంలో భూములు విక్రయించి ఉరవకొండలో విలువైన ఆస్తులు సమకూర్చుకున్నట్లు తెలిసింది. ఈ అక్రమాలు తెలిసినా దేవదాయ శాఖ అధికారులు నోరు మెదపకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మీరు చూస్తున్న ఈ ఇల్లు కర్ణాటకలోని అసొండి గ్రామంలోని కరిబసవస్వామి మఠంలో వెలసింది. గతంలో ఇక్కడ మఠానికి చెందిన ఆలయం ఉండేది. ఆలయాన్ని అర్చకుడు కూల్చి వేసి పక్కా భవనం నిర్మించుకున్నాడు. ఇందులోనే ఓ చిన్న గదిలో మూలన కరిబసవస్వామి ఫొటో పెట్టి అప్పుడప్పుడు పూజలు చేస్తుంటారు.

విచారణ జరిపిస్తాం



మఠం భూములు అమ్ముకునే హక్కు అర్చకులకు లేదు. అసొండిలో మఠం భూముల విక్రయాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం. కర్ణాటక ల్యాండ్ రెవెన్యూ యాక్టు కింద ధార్మిక సంస్థలకు చెందిన భూములను ఇతర వ్యక్తులకు అమ్ముకునే హక్కు ఉందా? లేదా? అనే అంశంపై ఆరా తీస్తూ ఆ ప్రాంత ఆర్‌డీఓ నుంచి లిఖిత పూర్వక వివరణ కోరాం. స్పష్టత వచ్చిన తర్వాత భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతాం. – చిట్టెమ్మ, సహాయ కమిషనర్, గవిమఠ సంస్థానం, ఉరవకొండ

క్లుప్తంగా

జిల్లాకు 1,740 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్: కోరమాండల్ కంపెనీ నుంచి 1,740 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. రాప్తాడు ఏఓ వెంకటేశ్వరప్రసాద్‌తో కలసి స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌లో వ్యాగన్ల ద్వారా జిల్లాకు సోమవారం చేరిన ఎరువులను పరిశీలించి అన్‌లోడ్ చేయించారు. 928 మెట్రిక్ టన్నుల 14–35–14 రకం ఎరువులు, 543 మెట్రిక్ టన్నుల 20–20–0–13 రకం ఎరువులు, 269 మెట్రిక్ టన్నుల 28–28–0 రకం ఎరువులు వచ్చాయన్నారు. కలెక్టర్, జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, సహకార సంఘాలు, డీసీఎంఎస్, అలాగే ప్రైవేట్, హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. మిగతావి మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేస్తామన్నారు.

'పోలీసు స్పందన'కు 88 వినతులు


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 88 వినతులు అందాయి. ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కాగా, ఉద్యోగాల కల్పన పేరుతో బెంగళూరులో నివాసముంటున్న చందన అనే మహిళ తమను మోసం చేసి రూ.2 లక్షలను తన ఖాతాలోకి బదలాయించుకుందని కృష్ణ, విక్రమ్‌తో పాటు పలువురు ఎస్పీకి స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్పీ అనంతపురం వన్‌టౌన్ పరిధిలో ఓ కేసు, నార్పల పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదుకు సిఫారసు చేశారు.

పోలీస్ పికెట్ ఏర్పాటుకు వినతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పుట్లూరు మండలం శనగలగూడూరు దళిత వాడపై అగ్రకులాలకు చెందిన కొందరు దాడి చేశారంటూ ఎంఆర్‌పీఎస్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. దాడులు పునరావృతం కాకుండా గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేయాలని కోరారు.

వైభవంగా కుళ్లాయిస్వామి చివరి దర్శనం



నార్పల: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గూగూడు కుళ్లాయిస్వామి పీరు చివరి దర్శనం సోమవారం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు హుస్సేనప్ప ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల కొండన్న వంశస్తులు స్వామి వారి ప్రతిమను పట్టు వస్త్రాల మధ్య భక్తులకు చూపించారు. అనంతరం పట్టు వస్త్రాల మధ్య ఉంచి పెట్టెలో భద్రపరిచారు.

చట్టాలపై అంగన్‌వాడీలకు అవగాహన తప్పనిసరి

- జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి దీనబాబు



మాట్లాడుతున్న న్యాయమూర్తి దీనబాబు

అనంతపురం సెంట్రల్: చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి దీనబాబు సూచించారు. సోమవారం న్యాయ సేవ సదన్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్, శాశ్వత లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం, బాల్య వివాహాల నిరోధం, మానవ అక్రమ రవాణా నిరోధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో జరిగే నేరాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలను సకాలంలో గుర్తించి అరికట్టేందుకు అవకాశముంటుందన్నారు. ఉచిత న్యాయ సహాయం అందించేందుకు న్యాయ సేవ అధికార సంస్థ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు, న్యాయవాదులు హరికృష్ణ, పద్మజ, సీడీపీఓలు లలిత, ధనలక్ష్మి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్లు

- జేసీ సోదరులపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా ధ్వజం



అనంతపురం క్రైం: అధికారంలో ఉన్నప్పుడు పంచభూతాలతో సహా సర్వమూ దోచేసిన జేసీ సోదరులు అవినీతి, అక్రమాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీని లక్ష్యంగా చేసుకుని ఇటీవల ఓ చానల్‌లో పేట్రేగిన జేసీ ప్రభాకరరెడ్డి తీరును సోమవారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పైలా ఎండగట్టారు. జేసీ ప్రభాకర్ రెడ్డి బురిడీ బాబా వేషం కట్టి ప్రవచనాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. జిల్లాలో ఫ్యాక్షన్‌కు పురుడు పోసి, పెంచి పోషించింది వారు కాదా అని ప్రశ్నించారు. జేసీ దివాకర్‌రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు తాడిపత్రిలో పదుల సంఖ్యలో వ్యక్తుల ప్రాణాలు బలిగొన్నారన్నారు. వేలాది చీనీచెట్లను కొట్టించి రైతుల ఆర్థిక మూలాలను దెబ్బ తీశారన్నారు. అభివృద్ధి పేరుతో సర్వమూ లూటీ చేశారన్నారు. వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత జేసీ సోదరుల పాపం పండి వారి అరాచకాలకు అడ్డుకట్ట పడిందన్నారు. దీంతో కుట్రపూరితంగా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ తండ్రి రాజారెడ్డిపై జేసీ ప్రభాకర్‌రెడ్డి అర్థరహిత వ్యాఖ్యలు చేశారన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి పెద్దగా చదువుకోకున్నా గొప్ప సంస్కారవంతుడని కొనియాడారు.

ఆర్టీసీ సేవల విస్తరణకు చర్యలు

- వైఎస్సార్ జిల్లా కడప జోన్ ఈడీ వెంకటేశ్వరరావు


కార్గో సర్వీసును పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

అనంతపురం సెంట్రల్: తనకు ప్రత్యేక అనుబంధమున్న అనంత జిల్లాలో ఆర్టీసీ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటానని వైఎస్సార్ జిల్లా కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం సాయంత్రం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్, కార్గో, బస్సు డిపోలను పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జిల్లాలో కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా తన ఉద్యోగ ప్రస్థానం మొదలైందని, ఇదే జిల్లాలో ఆర్‌ఎంగా కూడా పనిచేశానని గుర్తు చేశారు. ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. బస్టాండ్లలో మౌలిక వసతులు మెరుగు పరుస్తామన్నారు. నగరంలోని ఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న ఆర్టీసీ స్థలాన్ని 33 సంవత్సరాల కాల పరిమితితో లీజుకు ఇవ్వడానికి మంగళవారం ఔత్సాహిక వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్‌ఎం రమేష్ బాబు, డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, డిఎం నాగభూపాల్, డీఈ సురేంద్రబాబు, స్టేషన్ మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ సేవలు అమూల్యం


మౌనం పాటిస్తున్న కలెక్టర్ గౌతమి, ఇన్‌చార్జ్ జేసీ గాయత్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్

- కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం అకస్మిక మృతి బాధాకరమని కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. నాగభూషణం మృతికి సంతాపంగా సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్, అధికారులు రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నాగభూషణం నిబద్ధత కలిగిన అధికారిగా విధుల నిర్వహణలో ఆయన అందించిన సేవలు అమూల్యమని కొనియాడారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని స్థాయిల అధికారులు వివిధ రకాల ఒత్తిళ్లతో పనిచేస్తుంటారన్నారు. కాబట్టి అందరూ తరచూ వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీఎస్ఆర్ యాక్టివిటీ కింద ఉద్యోగులకు హెల్త్ చెకప్ చేసేలా ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గాయత్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్ జైన్, ఆర్‌డీఓ మధుసూదన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి


ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

అనంతపురం అర్బన్: రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా 2014 నుంచి రాయలసీమకు కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీరని ద్రోహం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మండిపడ్డారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలంటూ ఆ పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. విభజన చట్టంలోని హామీ మేరకు కడపలో ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వమే నిర్మించాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా మోదీ సర్కార్ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విభజన నాటి నుంచి సీమకు ద్రోహం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, బాలరంగయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్‌తో కలసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌వీనాయుడు, వెంకటనారాయణ, ప్రకాష్, వలి, రామాంజి పాల్గొన్నారు.

కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కర్ణాటకకు చెందిన లలీంద్ర కిడ్నాప్ కథ సుఖాంతమైంది. రెండు రోజుల క్రితం ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరు రాయచూర్ జిల్లా అలుకూరుకు చెందిన లలీంద్రను కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన మూడో పట్టణ పోలీసులు... ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మూడు బృందాలుగా విడిపోయి కిడ్నాపర్ల కోసం జల్లెడ పట్టారు. ఈ క్రమంలో బళ్లారి జిల్లాలోని ఓ తోటలో లలీంద్రను దాచినట్లు తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని లలీంద్రను కుటుంబసభ్యులకు అప్పగించారు. నిందితులను అనంతపురానికి తీసుకువచ్చి విచారణ చేస్తున్నారు.

పాక్సో కేసులో వ్యక్తి అరెస్ట్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పాక్సో కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు సోమవారం వెల్లడించారు. బీకేఎస్ మండలం, బొమ్మలాటపల్లికి చెందిన సతీష్... అనంతపురంలోని ఓ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని మాయ మాటలతో లోబర్చుకోవాలని చూశాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు బాలిక తెలపడంతో వారి ఫిర్యాదు మ ఏరకు విచారణ చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితుడు సతీష్‌పై కేసు నమోదు చేసి, సోమవారం రిమాండ్‌కు తరలించారు.

బ్లెకింగ్ వర్సిటీలో అడ్మిషన్లు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ), బీటీహెచ్ బ్లెకింగ్ యూనివర్సిటీ (స్వీడన్) సంయుక్తంగా ప్రవేశపెట్టిన డ్యూయల్ డిగ్రీ కోర్సుకు 12 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. వివరాలను జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన సోమవారం వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో భాగంగా బీటెక్ కోర్సు మూడేళ్లు జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో, ఒక సంవత్సరం విద్యను స్వీడన్‌లోని బీటీహెచ్‌లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బీటెక్ డిగ్రీని జేఎన్‌టీయూ, బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్శిటి (స్వీడన్) ప్రదానం చేస్తుందన్నారు. తర్వాత ఎంఎస్ (మాస్టర్స్) ప్రోగ్రాంను బీటీహెచ్‌లోనే చేయవచ్చునన్నారు. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ కంప్యూటర్ సైన్స్‌లో 10 మంది విద్యార్థులు, ఇంటి గ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ లో ఇద్దరు విద్యార్థులు అడ్మిషన్ పొందారన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులను వర్సిటీ రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్లు పి.సుజాత, ఆర్.కిరణ్మయి, వేల్పుల గురుదత్, జి.ఫణిశేఖర్ (బీటీహెచ్ వర్సిటీ) అభినందించారు.

యువకుడిని కాపాడిన ఎస్ఐ


కుమారుడిని తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ సురేష్

గుంతకల్లు రూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని సకాలంలో ఎస్ఐ కాపాడిన ఘటన సోమవారం గుంతకల్లులో చోటు చేసుకుంది. వివరాలు.. గుంతకల్లులోని దోనిముక్కల రోడ్డులో బోయ దేవి, తన కుమారుడు రాణతో కలసి నివాసముంటున్నారు. రాణా చిన్నప్పుడే తండ్రి నాగార్జున మృతి చెందాడు. కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు వెన్నాడుతుండడంతో సోమవారం ఉదయం తల్లితో గొడవపడి రాణ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన దేవి వెంటనే గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్‌కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఆయన రాణ ఫోన్ నంబర్‌కు పలుమార్లు కాల్ చేస్తే ఎత్తాడు. తాను హనుమాన్ సర్కిల్‌లోని రైల్వే ట్రాక్‌పై ఉన్నానని, ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు తెలిపాడు. అప్రమత్తమైన ఎస్ఐ వెంటనే అక్కడకు చేరుకుని రాణకు నచ్చచెప్పి పోలీస్ స్టేషన్‌కు పిలుచుకెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

బాలింత మృతి

- శివచైతన్య ఆస్పత్రికి నోటీసు జారీ

అనంతపురం క్రైం: నగరంలోని 35వ డివిజన్ వెంకట్రావ్ నగర్‌కు చెందిన బాలింత ప్రశాంతి(32) మృతి చెందింది. బిడ్డకు జన్మనిచ్చిన గంటల వ్యవధిలోనే ఆమె కన్నుమూసింది. వివరాలు... అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని 52వ సచివాలయ పరిధిలో వలంటీర్‌గా పని చేస్తున్న ప్రశాంతి, నల్లపరెడ్డి దంపతులు వెంకట్రావ్ నగర్‌లో నివాసముంటున్నారు. వీరికి పదేళ్ల వయసున్న బాబు ఉన్నాడు. రెండో సారి గర్భం దాల్చిన ఆమె రాంనగర్‌లోని శివచైతన్య హాస్పిటల్లో చికిత్స తీసుకున్నారు. ప్రసవం కోసం జూలై 30న ఆస్పత్రిలో భర్త నల్లపరెడ్డి చేర్పించాడు. రాత్రి 11.30 గంటలకు మగబిడ్డను ప్రశాంతి ప్రసవించింది.


మార్చురీలో ప్రశాంతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న మేయర్ వసీం

రక్తస్రావంతో మృతి..

బాబు ఏడవకపోవడంతో వైద్యురాలు డాక్టర్ చైతన్య సూచన మేరకు శిశువును తీసుకుని సర్వజనాస్పత్రికి నల్లపరెడ్డి వెళ్లాడు. అదే సమయంలో ఆస్పత్రికి చేరుకున్న నల్లపరెడ్డి దూరపు బంధువులు సుదర్శన్‌రెడ్డి, అశ్వత్థనారాయణ తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న ప్రశాంతిని చూసి వైద్యులను అప్రమత్తం చేసేలోపు ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. రాత్రి 12 గంటలకు డాక్టర్ చైతన్య పరిశీలించి జీజీహెచ్‌కు తీసుకెళ్లాలని తెలపడంతో కుటుంబసభ్యులు ప్రైవేట్ అంబులెన్స్‌లో నగర శివారులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. వారితో పాటు డాక్టర్ చైతన్య కూడా ఉన్నారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. కాగా, డాక్టర్ చైతన్య 'సాక్షి'తో మాట్లాడుతూ.. రక్తస్రావం జరిగి ప్రశాంతి అపస్మారక స్థితిలో వెళ్లి మృతి చెందిందని, తమ తప్పిదం లేదని చెప్పారు.

సోమవారం ఉదయం ప్రశాంతి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, ప్రశాంతి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ భర్త నల్లపరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు.

ఆస్పత్రికి నోటీసు..

శివచైతన్య ఆస్పత్రిని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ సోమవారం పరిశీలించారు. ఫెర్టిలిటీ (సరోగసి) అనుమతులు లేకపోయినా బోర్డు వేయడాన్ని తప్పుబట్టారు. బాలింత మృతిపై 48 గంటల్లో వివరణ ఇవ్వాలని వైద్యురాలు డాక్టర్ చైతన్యకు నోటీసులు జారీ చేశారు.

మేయర్ వసీం నివాళి..

వలంటీర్ ప్రశాంతి మృతి విషయాన్ని తెలుసుకున్న మేయర్ వసీం, పార్టీ సీనియర్ నేతలు అనంత చంద్రారెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి సర్వజనాస్పత్రిలోని ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వలంటీర్ ప్రశాంతి మృతి పట్ల ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేసి వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో నగర పాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులున్నారు.

వలంటీర్లకు ప్రభుత్వం అండ..

ఆకస్మిక మరణం పొందిన ఇద్దరు వలంటీర్లకు ప్రభుత్వం అండగా నిలిచింది. నగరంలోని 23వ డివిజన్‌లోని 42వ సచివాలయంలో ప్రజలకు సేవలందించే జహరాబీ ఈ నెల 20న, 52వ సచివాలయ వలంటీర్ ప్రశాంతి సోమవారం ఆకస్మిక మరణం పొందారు. వీరి కుటుంబ పరిస్థితులను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి తీసుకెళ్లడంతో సీఎం సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది.

క్లుప్తంగా

వైవీ రావు సేవలు స్ఫూర్తిదాయకం



డాక్టర్ వైవీ రావును సన్మానిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డిప్యూటీ ఆర్ఎంఓ, ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు సేవలు స్ఫూర్తిదాయకమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం జీజీహెచ్‌లో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. సూపరింటెండెంట్ చాంబర్‌లో డాక్టర్ వైవీ రావును సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్, కార్యాలయం మినిస్టీరియల్ స్టాఫ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్, సీనియర్ వైద్యులు డాక్టర్ శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక ఐఎంఏ హాల్‌లో ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ వైవీ రావుకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మెరుగైన చికిత్సకు సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: బెళుగుప్పలోని శ్రీనివాస విద్యానికేతన్ యాజమాన్యం విద్యార్థుల చికిత్సకు ఆర్థిక సాయం అందజేసి పెద్దమనసు చాటుకుంది. పాఠశాల విద్యార్థులు ఉప్పర దీక్షిత, ప్రవీణ్ కుమార్ తండ్రి ఉప్పర నరసింహులు గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని 'ట్రస్ట్ వెల్ హాస్పిటల్'కు తరలించారు. రూ.లక్ష పోగు చేసి, సోమవారం డీఈఓ సాయిరామ్ చేతుల మీదుగా నరసింహులు కుమార్తె దీక్షితకు అందించారు. పాఠశాల నిర్వాహకులు వి.శ్రీనివాసులు, అపుస్మా జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, ట్రెజరర్ ఇక్బాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, నాగరాజు, సంజీవరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

డ్రైవర్‌ను సన్మానించిన కలెక్టర్



డ్రైవర్ రామకృష్ణ దంపతులను సన్మానించిన కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: కలెక్టర్ వాహన డ్రైవర్ రామకృష్ణ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామకృష్ణ దంపతులకు కలెక్టర్ గౌతమి శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో సీసీలు సంజీవరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, మూర్తి, గన్‌మెన్ మురళీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

73 మందికి ఉద్యోగాలు

అనంతపురం రూరల్: టెక్ మహీంద్ర కంపెనీ ఆధ్వర్యంలో పీవీ కేకే కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 73 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి, అనంతరం ట్రైనీ అసోసియేట్‌గా నియమించనున్నట్లు తెలిపారు. వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుందన్నారు. విద్యార్థులను బాలాజీ విద్యాసంస్థల అధినేత పల్లె రఘునాథ్ రెడ్డి, పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిషోర్ అభినందించారు.

వైఎస్సార్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం తగదు



మాట్లాడుతున్న ఏపీ రెడ్డి సంఘం నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటును అడ్డుకోవడం అనైతిక చర్య అని ఏపీ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు జి. బయపరెడ్డి, విద్యార్థి విభాగం కోఆర్డినేటర్ ఆర్.నితిన్ రెడ్డి అన్నారు. సోమవారం ఎస్కేయూలో వారు విలేకరులతో మాట్లాడారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించిన ఘనత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిదేనన్నారు. మహోన్నత మూర్తి అయిన డాక్టర్ వైఎస్సార్‌కు కులం, రాజకీయ పార్టీని ఆపాదించడం తగదన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ బోధనేతర సంఘం మాజీ అధ్యక్షుడు టి. పురుషోత్తం రెడ్డి, జిల్లా సలహాదారు పాటిల్ రామకృష్ణారెడ్డి, ఆకుతోటపల్లి ఎంపీటీసీ సునీల్ దత్తారెడ్డి, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

• దొరక్కుండా బండి తిప్పరా!





పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండడంతో ముళ్లపొదల వైపు వెళ్తున్న వాహనదారులు

అనంతపురం నగర శివారులో జాతీయ రహదారి పక్కన సోములదొడ్డి సర్కిల్‌లో పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు లేనివారికి జరిమానా విధించారు. ఈ విషయాన్ని గమనించి నగరంలోకి వెళ్తున్న వాహనదారులు, నగరం నుంచి పొరుగూర్లకు వెళ్తున్న వాహనదారులు పోలీసులు గుర్తిస్తారేమోనని ఇలా భయంతో వాహనాలను దారి మళ్లించారు. కొందరు వాహనదారులు హైవే నుంచి అడ్డదిడ్డంగా వాహనాలను తిప్పి వెళ్లారు. జరిమానా దేవుడెరుగు..అనుకోని ప్రమాదం జరిగితే 'మూల్యం' చెల్లించుకోవాల్సి వచ్చేదని స్థానికులు చర్చించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





వాహనాలను దారి మళ్లించిన దృశ్యం



రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు



సోములదొడ్డి సర్కిల్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

అనంతపురం క్రైం: రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మేయర్ వసీం స్పష్టం చేశారు. ఇందుకోసం నాలుగేళ్ల పాలనలో రూ.23 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. అదే టీడీపీ ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుని, వారి పాలనలో రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. ఆయన సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మైనార్టీలను సీఎం జగన్ విస్మరిస్తున్నారంటూ శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తమ ప్రభుత్వంలో దేశ చరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా సామాజిక, విద్య, రాజకీయ రంగాల్లో మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. డిప్యూటీ సీఎం పదవి, నలుగురికి ఎమ్మెల్యే, నలుగురికి ఎమ్మెల్సీ, మేయర్, సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతో పాటు నామినేటెడ్ పోస్టులను పెద్ద ఎత్తున కేటాయించి, రాజకీయ భవిష్యత్తు కల్పించారన్నారు. నగరంలో తనకు మేయర్ పదవి, మరో పది మంది మైనార్టీలకు కార్పొరేటర్లుగా అవకాశం కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన టీడీపీ.. మైనార్టీలకు ఏం చేసిందో చెప్పాలని షరీఫ్‌ను నిలదీశారు. గత ప్రభుత్వంలో మైనార్టీ సంక్షేమ శాఖను కూడా పల్లె రఘునాథరెడ్డికి కట్టబెట్టి మైనార్టీలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. సమావేశంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు బాబా, రహంతుల్లా, కో ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు ఖాదర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి జగన్ ప్రాధాన్యం

అనంతపురం సిటీ: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీమ్ అహమ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ అన్నారు. వీరు సోమవారం నగర పరిధిలోని కక్కలపల్లిలో గల మస్జీద్-ఏ-ఔలియా, మస్జీద్-ఏ-గరీబ్ నవాజ్ మసీదుల్లో 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంనిర్వహించారు.

గ్రామాల్లో మొహర్రం వేడుకలు



కొలువుదీరిన పీర్లు

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల, గొరిదిండ్ల గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో పెద్ద సరిగెత్తు జరిగింది. ముట్టాలలోని పీర్ల చావిడిలో వన్నూర్ స్వామికి భక్తులు పెద్ద ఎత్తున చక్కెర చదివింపులు చేయించారు. మంగళవారం జలధి ఉంటుందని తెలిపారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

రాప్తాడు: మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. మండల కేంద్రం రాప్తాడుకు చెందిన గ్రామపెద్దలు, గ్రామస్తులు మొహర్రం జరుపుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఎస్ఐను కోరారు.

హాజరుశాతం పెంచండి

ఆత్మకూరు: విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఎంఈఓ నరసింహారెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చే శారు. హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. పాఠశాలకు రాని పిల్లలు ఉంటే వారి తల్లిదండ్రులను పిలిపించి,బడికి వచ్చేలా చూడాలన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. ఎంఈఓ–1 మున్వర్ బాషా మాట్లాడుతూ ఆత్మీయట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు రాజశేఖర్, పరమేశ్వరరెడ్డి, పాఠశాల హెచ్ఎం, అమర్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో 'అనంత'కు ద్వితీయ స్థానం



రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొన్న అనంతపురం జిల్లా క్రీడాకారులు

అనంతపురం: అనకాపల్లి జిల్లా రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో గత నెల 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ గ్రాఫిక్ కుస్తీ పోటీల్లో బాల బాలికల ఓవరాల్ చాంపియన్ షిప్ రెండో స్థానంలో అనంతపురం జిల్లా నిలిచింది.

గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులు : వినయ్ కుమార్, తేజస్విని, రాణి, మెహతాజ్, ప్రీతి, అంజం, సమీరా నిహారిక, భరత్, ఆశిష్ సాయి, ప్రవీణ్, రాఖీ హేమంత్‌కుమార్, మొక్కషిత్ సాయి తేజ, మనోజ్‌కుమార్, ధర్మసాయి, సాయి మాధవ్.

సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారులు : ఈశ్వర్, యశ్వంత్, విష్ణువర్ధన్ నాయక్, మహీధర్, అఖిల్ కుమార్, మహమ్మద్ సల్మాన్, అయేషా సిద్దిఖీ, రేణుకా, ప్రణతి, అక్షయ.

బ్రొంజ్ మెడల్ సాధించిన వారు : హేమంత్‌కుమార్ గౌడ్, అక్సా, నవ్యా, మనీషా, బీబీ రిషన్. వీరంతా ఈనెల నాల్గో వారంలో హరియాణా రాష్ట్రం సోనిపత్ నగరంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కుస్తీ కోచ్ రాఘవేంద్ర సహకారంలో వారు జాతీయ స్థాయికి ఎదిగారని గ్రాఫిలింగ్ కమిటీ ఆఫ్ అనంతపురం సెక్రటరీ వాణి తెలిపారు. విజేతలకు రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అనంతపురం సీఈఓ కేశవ నాయుడు, జిల్లా చీఫ్ కోచ్ అలీషా, మేనేజర్ జబీనా అభినందనలు తెలిపారు.

నూతన రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పూలే విగ్రహం వద్ద నుంచి న్యాయశాస్త్ర విభాగం , ఇంజినీరింగ్ కళాశాల వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి సోమవారం ఉదయం భూమి పూజ చేసి, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.2 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు నిర్మించనున్నారు. ఇప్పటి వరకు క్యాంపస్‌లో 20 అడుగుల రోడ్డు మాత్రమే ఉన్నాయి. నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం చేయాలని వీసీ సంకల్పించారు. ఇప్పటికే చిత్రావతి హాస్టల్ నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. గత నెల 17న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ప్రారంభించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ కృష్ణకుమారి, ఎస్ఈ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలికిరి సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)పరిధిలోని కలికిరి ఇంజినీరింగ్ కళాశాల సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎండీ నాగభూషణానికి షోకాజ్ నోటీసు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు, ఉన్నత విద్యామండలి చైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఈ మేరకు జేఎన్‌టీయూ (ఏ) పాలక మండలి నిర్ణయం తీసుకుంది. జారీ చేసిన షోకాజ్ నోటీసుకు ఆయన 15 రోజుల్లోపు సమాధానం ఇవ్వాల్సి ఉంది.

భక్తిశ్రద్ధలతో సహస్ర ఘటాభిషేకం

అనంతపురం కల్చరల్: స్థానిక మారుతీనగర్‌లోని శివాలయంలో సోమవారం సహస్ర ఘటాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్ రెడ్డి, సెక్రటరీ వెంకటేష్, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వేదపండితులు శాస్త్రోక్తంగా మంత్రోచ్చారనల మధ్య స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేదపండితులు గరుడాద్రి సురేష్ శర్మ, వాసుదేవ శాస్త్రి, విద్యాధర శర్మ, ఆలయ అర్చకులు నాగరాజ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'నాసా' ప్రోగ్రామ్‌కు చైతన్య పాఠశాల విద్యార్థులు

రాప్తాడురూరల్: ప్రతిష్టాత్మకమైన నాసా ప్రోగ్రామ్‌కు అనంతపురం కోర్టురోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని సోమవారం చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మెమొంటో అందజేసి అభినందించారు. అంతరిక్షంలో మానవుడు నివసించడానికి అవకాశాలను పరిశోధన ద్వారా తెలుసుకొని నిర్ధారణ చేసుకోవచ్చని, తమ విద్యార్థులు వారి ప్రాజెక్టు ద్వారా నిరూపించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అమెరికాలో జరిగే 192 దేశాల ప్రతినిధుల మధ్యలో ప్రాజెక్టు గురించి వివరించనున్నారు. ప్రిన్సిపాల్ తబస్సుమ్, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, నాసా మెంటర్ సతీష్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, ఏఓ గోపాల్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

నాయకత్వం పటిష్టంగా ఉండాలి : డీఈఓ

రాప్తాడు రూరల్: పాఠశాల విద్య బలోపేతం కావాలంటే క్షేత్రస్థాయి అమలులో ప్రధాన భూమిక పోషించే 'స్కూల్ హెడ్స్' నాయకత్వం పటిష్టంగా ఉండాలని డీఈఓ ఎం.సాయిరామ్ అన్నారు. 'పాఠశాల లీడర్ షిప్' అంశంపై అనంతపురం శివారులోని టీటీడీసీలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మూడో విడత శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ జరుగుతుంది. శిక్షణ ప్రారంభించిన డీఈఓ మాట్లాడుతూ... విధినిర్వహణలో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ శిక్షణ పరిష్కార మార్గాలు చూపుతుందన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలన్నారు. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం, నాయకత్వ సామర్థ్యాల పెంపు తదితర అంశాలపై రిసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇస్తారన్నారు. పరిశీలకులు నాగమ్మ, ఏఎంఓ విభాగం ప్రసాద్, రఫీ, చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎంపీ మాధవ్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఎంపీ గోరంట్లమాధవ్ దంపతులు

రాప్తాడురూరల్: ఆగస్టు 21న కర్నూలులో జరగనున్న తన సోదరుడి కుమార్తె వివాహానికి రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హిందూపురం ఎంపీ గోరంట్లమాధవ్ దంపతులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని ఎంపీ గోరంట్లమాధవ్, ఆయన సతీమణి సవిత కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందించారు.

ఎస్కేయూలో ఇద్దరికి డాక్టరేట్



ఎం. శ్రీలక్ష్మి



బీఆర్ చైతన్యకుమార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగంలో పరిశోధన చేసిన ఎం.శ్రీలక్ష్మికి సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ జె.ఖేజియా రాణి పర్యవేక్షణలో 'యాన్ ఇంప్రూవ్ ఎనర్జీ ఎఫిషియన్సీ విత్ ఐఓటీ స్కాలబిలిటీ ఇన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్ వర్క్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై అంతర్జాతీయ జర్నల్స్‌లో కూడా వ్యాసాలు ప్రచురించారు.

= కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన చేసిన బీఆర్ చైతన్య కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ కె.సుధాకర్ బాబు పర్యవేక్షణలో 'సింథసిస్, క్యారక్టరైజేషన అండ్ బయోలాజికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్‌మెటల్ కాంప్లెక్సెస్ ఆఫ్ హెటరోసైక్లిక్ హైడ్రోజోన్స్' అనే అంశంపై పరిశోధన చేశారు.

దంపతులకు గాయాలు

రాప్తాడురూరల్: సోములదొడ్డి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం నగరం హెచ్ఎల్‌సీ కాలనీ చెందిన ఫక్కీరప్ప, రుక్మిణి దంపతులు నీలిమా సర్కిల్‌లో జిరాక్స్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. దంపతులు వ్యక్తిగత పనినిమిత్తం పామిడికి వెళ్లి, తిరుగు ప్రయాణంలో సోములదొడ్డి వద్ద సర్వీస్ రోడ్డుపైకి వెళ్తుండగా, వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన కారు సైడు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.